డీఏ బకాయిలు ఇవ్వాలి

కరీంనగర్ టౌన్/భగత్‌నగర్, జూలై 7: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్‌కు రావలసిన నాలుగు విడతల డీఏ బకాయిలను వెంటనే ప్రభుత్వం ఇవ్వాలని పీఆర్‌టీయు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, విశ్రాంత ఉపాధ్యాయుడు నరహరి లక్ష్మారెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జాలి మహేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు నెలకు కనీసం 5 నుంచి 10వేల వరకు నష్టపోతున్నారని, సీఎం రేవంత్‌రెడ్డి దీనిపై ప్రత్యేక చొరవ తీసుకొని డీఏ బకాయిలను ఇవ్వాలని కోరారు.

రామాయణ్ సర్క్యూట్‌లో

ఇల్లందకుంట రామాలయం



ఇల్లందకుంట, జూలై 7: ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆలయం రామాయణ్ సర్క్యూట్ కింద ఎంపికైనట్లు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈ రామాలయానికి ఎంతో ప్రాధాన్యం ఉన్నా ఇప్పటి వరకు అభివృద్ధికి నోచుకోలేదు. గతంలో మాజీ మంత్రి ఈటల రాజేందర్ సహకారంతో ఆలయానికి నాలుగు దిక్కుల రాజగోపురాలు, బండ పరుపు, కల్యాణ మండపం నిర్మించారు. ఇటీవల కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్ కుమార్ ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అభివృద్ధికి తప్పకుండా కృషి చేస్తానని చెపారు. అందులో భాగంగా ఆలయాన్ని రామాయణ్ సర్క్యూట్ కింద ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఆలయంలో వసతి గదులు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఉందామంటే కనీస వసతులు లేవు. ఆలయంలో ప్రదక్షిణలు చేసే సమయంలో ఎండకు భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆలయం ప్రహరీలోపల రేకులు ఏర్పాటు చేస్తే బాగుంటుందని భక్తులు అంటున్నారు. గతంలో ప్రభుత్వాలు ఇచ్చిన హామీ మేరకు హరిత హోటల్, రిజర్వాయర్ బోటింగ్ ఏర్పాటు చేస్తే భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఆలయానికి వచ్చే దారిలో జమ్మికుంట- కొత్తపల్లి వద్ద కమాన్ ఏర్పాటు చేస్తే కొత్తగా వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది. కరీంనగర్ నుంచి, హనుమకొండ నుంచి ఇల్లందకుంటకు ప్రతిరోజు బస్సు సౌకర్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

మందుబాబులపై కొరడా



- విస్తృతంగా డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు
- ఆరు నెలల్లో 189 మంది వాహనదారులకు జైలు శిక్ష, జరిమానాలు

కరీంనగర్ క్రైం, జూలై 7: ప్రజల భద్రత, రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్‌లను కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు రాత్రి మాత్రమే నిర్వహించే డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు ఉదయం, మధ్యాహ్నం వేళల్లో కూడా కొనసాగిస్తుండడంతో మందుబాబులు వాహనాలు నడిపేందుకు జంకుతున్నారు. పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు నిర్వహించిన తనిఖీల్లో 1,300 మంది మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారు. 189 మందికి కోర్టు జైలుశిక్ష లేదా జరిమానా విధించింది.

మూడు నెలల వరకు జైలుశిక్ష

మద్యం సేవించి వాహనాలు నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో దొరికిన వారికి కోర్టులు జైలు శిక్ష, జరిమానాలు విధిస్తున్నాయి. మద్యం సేవించిన మోతాదునుబట్టి ఒకరోజు నుంచి మూడు నెలల వరకు జైలుశిక్షలు, జరిమానాలు విధిస్తున్నారు. డ్రంకెన్‌డ్రైవ్ కేసులతో పలు ప్రాంతాల్లో మందుబాబుల ఆగడాలు, రోడ్డు ప్రమాదాలు కొంత మేరకు నియంత్రణలోకి వచ్చాయి. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలకు గురవడంతోపాటు ఎలాంటి సంబంధం లేని అనేక మంది గాయాలపాలై ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రైవేట్ వాహనదారులకు ఉదయం, మధ్యాహ్నం వేళల్లో డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండడంతో ప్రయాణికుల సమస్యలు పరిష్కారమయ్యాయి. మహిళలు అభద్రతభావానికి లోనుకాకుండా తమ ప్రయాణాలను కొనసాగిస్తున్నారు. గతంలో మద్యం సేవించి వాహనాలు నడిపేవారి సంఖ్య గణనీయంగా ఉండేది. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల గతంలో అనేక రోడ్డు ప్రమాదాలు జరిగాయి. అనేకమంది వాహనదారులు రోడ్డు ప్రమాదాలబారిన పడ్డారు.

మద్యంసేవించి వాహనాలు నడపవద్దు

- కరీం ఉల్లాఖాన్, కరీంనగర్ ట్రాఫిక్ సీఐ

మద్యం సేవించిన సమయంలో వాహనాలు నడపకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలి. మద్యం మత్తులో అతివేగంగా నడపటంతో అదుపుతప్పి ప్రమాదాలబారిన పడుతున్నారు. దీంతో ఆయా కుటుంబాలు తీవ్రమైన ఆరోగ్య, ఆర్థిక ఇబ్బందులబారినపడి రోడ్డుపాలవుతున్నారు. ప్రమాదాల నియంత్రణకే డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నాం.

అవగాహన కార్యక్రమాలు... కౌన్సెలింగ్

మద్యం సేవించి వాహనాలు నడిపేవారిని నియంత్రించేందుకు కమిషనరేట్ పోలీసులు పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పోలీసులకు చిక్కిన వారికి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తూ కోర్టులో హాజరుపరుస్తున్నారు. తరచూ తనిఖీల్లో పోలీసులకు చిక్కుతున్న వ్యక్తుల లైసెన్సుల రద్దుకు రవాణాశాఖ అధికారులతో కలిసి రంగం సిద్ధం చేస్తున్నారు.



పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్టం చేయాలి

- మాజీ మంత్రి గంగుల కమలాకర్



మాట్లాడుతున్న మాజీ మంత్రి గంగుల కమలాకర్

మానకొండూర్, జూలై 7: పంచాయతీ రాజ్ వ్యవస్థను పటిష్టం చేసి స్థానిక సంస్థల బలోపేతానికి కృషి చేయాలని మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. మానకొండూర్‌లో ఆదివారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఆధ్వర్యంలో జిల్లాలోని ఎంపీపీ, జడ్పీటీసీలకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేసీఆర్ హయంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. తెలుగు రాష్ట్రాల సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు సమావేశంతో రాష్ట్రానికి ఒరిగిందేమి లేదన్నారు. ప్రాంతీయ పార్టీలకు బతుకు లేదన్న మోదీ ఇపుడు ప్రాంతీయ పార్టీలతోనే బ్రతుకుతున్నాడని అన్నారు. పులిలా ఉన్న మోదీ ఇప్పుడు పిల్లిలా మారి పవన్‌కల్యాణ్, చిరంజీవి చేతులు ఎత్తాడని విమర్శించారు. పార్టీ కోసం నాయకులు పని చేయాలని, ప్రతిపక్ష పార్టీల మీదనే ఎక్కువ ఆశలు ఉంటాయని అన్నారు. డ్యాంలు ఎండిపోయి నీళ్లులేక రైతులు అనేక అవస్థలు పడుతున్నారని అన్నారు. మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్టీ వీడిన భయపడేది లేదని, కొత్త రక్తంతో పార్టీని మరింత బలోపేతం చేస్తామని అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ బీఆర్ఎస్‌ను విమర్శించడం తగదన్నారు. అనంతరం జడ్పీటీసీలు, ఎంపీపీలను పూల మాల శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు వొడితల సతీష్‌బాబు, రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారాదాసు లక్ష్మణ్‌రావు, మేయర్ సునీల్‌రావు, మాజీ మేయర్ రవీందర్ సింగ్ పాల్గొన్నారు.

కరీంనగర్-జగిత్యాల రోడ్డు పనులకు 15 రోజుల్లో టెండర్లు

- వచ్చే ఏడాది జూలై నాటికి పనులు పూర్తి
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



అధికారులతో చర్చిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

కరీంనగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కరీంనగర్-జగిత్యాల రోడ్డ విస్తరణ పనులకు 15 రోజుల్లో టెండర్లు పూర్తవుతాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో జాతీయ రహదారులు ఎన్‌హెచ్ 563 విస్తరణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రూపొందించిన వంద రోజుల ప్రణాళికలో కరీంనగర్-జగిత్యాల రోడ్డు విస్తరణ ఉందన్నారు. కరీంనగర్-జగిత్యాల రోడ్డు విస్తరణకు త్వరలో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. మూడు ప్రాంతాల్లో బైపాస్ రోడ్లను నిర్మిస్తున్నట్లు, 2,227 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 58 కిలోమీటర్ల మేర చేపట్టే విస్తరణ పనుల్లో ఆరు మేజర్, 18 మైనర్ బ్రిడ్జిలు, 195 కల్వర్టులను నిర్మించనున్నట్లు తెలిపారు. వచ్చే సంవత్సరం జూలై నాటికి పనులు పూర్తవుతాయన్నారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణలో ఎదురయ్యే సమస్యలను కలెక్టర్, ఇతర శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. కరీంనగర్ నుంచి వరంగల్ వరకు జాతీయ రహదారి విస్తరణ పనుల పురోగతిపై మాట్లాడుతూ ఇప్పటికే 37 శాతం పూర్తయిందన్నారు. కరీంనగర్ నుంచి వరంగల్ వరకు 68.015 కిలోమీటర్ల మేర జరుగుతున్న పనుల్లో మానకొండూర్, తాడికల్, హుజూరాబాద్, ఎల్కతుర్తి, హసన్‌పర్తి వద్ద బైపాస్‌లను నిర్మించనున్నట్లు తెలిపారు. 29 మైనర్ జంక్షన్లను నిర్మించను న్నామన్నారు. గట్టుదుద్దెనపల్లి, చెంజర్లలో భూసేకరణలో కొంత ఇబ్బందులు ఎదురయ్యాయని అధికారులు తెలుపగా వెంటనే కలెక్టర్ పమేలా సత్పతితో ఫోన్‌లో మాట్లాడారు. కరీంనగర్ ఆర్డీవోను పిలిపించి భూసేకరణ సమస్యను పరిష్కరించాలని సూచించారు. ప్రజల విజ్ఞప్తుల మేరకు సర్వీస్, స్ట్రక్చరల్ రోడ్ల నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ మాధవి, అధికారులు క్రిష్ణారెడ్డి, నిర్మాణ సంస్థ ప్రతినిధులు రమేష్ త్రిపాఠి కమలేశ్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

కరీంనగర్ కల్చరల్, జూలై 7: గ్రంథాలయాలను ఉన్నతంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ సంచాలకుడు ఏవీఎన్ రాజు అన్నారు. ఆదివారం ఆయన జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించారు. విద్యార్థులు, పాఠకులతో ముచ్చటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా చల్లటి, వేడి నీరు వచ్చే ఓల్టాస్ యంత్రాలను వెంటనే కొనుగోలు చేయాలని కార్యదర్శికి ఆదేశాలిచ్చామని తెలిపారు. పోటీ, మోడల్ పరీక్షల నిర్వహణ, వసతుల ఏర్పాట్లు, సిబ్బంది సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు తామెంచుకున్న కోర్సుల్లో విజయం సాధించాలంటే కఠోరంగా శ్రమించాలన్నారు. పాఠకులు, విద్యార్థులు అడిగిన పుస్తకాలను సిబ్బంది అందుబాటులో ఉంచాలని, విలువైన మరిన్ని పుస్తకాలను తెప్పించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది జి సరిత, ఎండీ గఫార్, జె గౌతమి, తిరుపతి, సుమన్, పవన్, శశి, రిటైర్డ్ ఉద్యోగి నాంపల్లి పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏవీఎన్ రాజు

చిన్న వర్షాలకే ఛిద్రం

ఇంకా పూర్తి స్థాయిలో వర్షాలు పడనే లేదు. అప్పుడే గ్రామీణప్రాంతాల్లోని రోడ్లు దెబ్బతింటున్నాయి. జిల్లాలోని పలు రోడ్లు అధ్వానస్థితికి చేరాయి. పలుచోట్ల రోడ్లు గుంతలమయమయ్యాయి. దీంతో ఆయా రోడ్డుపై ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- గుంతలమయంగా గ్రామీణ రోడ్లు
- ఇబ్బందిపడుతున్న వాహనదారులు



ప్రధాన రహదారిపై ఉన్న గుంతలు

రామడుగు, జూలై 7: రామడుగు మండలంలో అంతర్గత రోడ్లతో పాటు ప్రధాన రహదారులు అధ్వానంగా మా రాయి. రోడ్లపై గుంతలు పడి రాకపోలకు ఇబ్బంది కలిగినా అధికారులు పట్టించు కోవడం లేదనే విమర్శలు వినిపిస్తు న్నాయి. గ్రామాల్లో అంతర్గత రోడ్లు చినుకుపడితే చిత్తడి అవుతున్న పరిస్థితి ఉన్నాయి. ఆర్అండ్‌బీ రోడ్ల పరిస్థితి అంతకంటే అధ్వానంగా తయారైంది. రామడుగు మండల కేంద్రంలో రైతు వేదిక సమీపంలోని ప్రధాన రహదారిపై భారీ గుంతలు పడి వర్షపు నీరుతో నిండి చెరువును తలపిస్తోంది. గోపాల్ రావుపేట నుంచి కరీంనగర్ ప్రధాన రహదా రిపై నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుండగా రాకపోకలకు తీవ్ర ఇబ్బం దులు ఎదురవుతున్నాయి. మోకాలు లోతు గుంత ఉండి రోడ్డంతా జలమయం కావడంతో భారీ వాహ నాలు వెళ్లాలంటే కష్టంగా మారింది. ద్విచక్ర వాహన దారులు పక్క నుంచి భయంభయంగా ప్రయాణం సాగిస్తున్నారు. ఆటోలు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాదారులు నరకాన్ని చవి చూస్తున్నారు. ఇంత ఇబ్బంది పడుతున్నా సంబం ధిత అధికారులు చోద్యం చూస్తున్నరంటూ ప్రయాణి కులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గోపాల్‌రావుపేటలో బూరుగుపల్లికి వెళ్లే ప్రధాన రహదారి అడుగడుగునా గుంతలమాయంగా మారింది. గుంతల్లో నీరు నిలిచి చెరువును తల పిస్తుంది. వర్షం పడితే గుంతలమా యంగా మారిన రహదారిపై ప్రయాణికులు ప్రాణా లను అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ రహదారుల గుండా నిత్యం కరీంనగర్, జగిత్యాల జిల్లా కేంద్రాలకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రామడుగు మండల కేంద్రంలోని వాగు వంతెన నుంచి మొదలుకుంటే చిప్పకుర్తి శివారు రైతు వేదిక వరకు రోడ్డు గుంతలమాయంగా మా రింది. అన్ని గ్రామాల్లోనూ రోడ్ల పరిస్థితి ఇలాగే ఉన్న ఆర్అండ్‌బీ శాఖ అధికారులు కనీసం కన్నెత్తి కూడా చూడకపోవడంపై ప్రయా ణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. గుంతలమాయంగా మా రిన ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లను మర మ్మతులు చేపట్టి రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతు న్నారు.



రామడుగు మండలం గోపాల్‌రావుపేట- బురుగుపల్లి రహదారిపై ఏర్పడ్డ గుంతలు

అధ్వానంగా గుంపుల రోడ్



గుంపుల ఎక్స్ రోడ్‌లో పూర్తిగా ధ్వంసమైన రోడ్డు

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మండలం తనుగుల గ్రామ పరిధిలోని గుంపుల ఎక్స్ రోడ్ అధ్వానంగా మారింది. ఎక్స్ రోడ్ నుంచి గుంపుల ఫ్లైఓవర్ బ్రిడ్జి ఎంట్రన్స్ వరకు ఉన్న బీటి రోడ్డు గుంతల మయం అయింది. భారీ ఇసుక లోడుతో లారీల రాకపోకల వల్ల రోడ్డు పూర్తిగా ధ్వసమైంది. జమ్మికుంట మీదుగా కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్, పెద్దపల్లి, గోదావరిఖని, మంచిర్యాల, మందమర్రి, బెల్లంపల్లి వైపు వెళ్లే ప్రయాణికులకు గుంపుల ఎక్స్ రోడ్ నుంచే వెళతారు. ఆర్టీసీ బస్సులు, కార్లు, ఇతర ప్రైవేట్ వాహనదారులు ఆ రోడ్డు మీదుగా వెళ్లాలంటే జంకుతున్నారు. వాహనాల సస్పెన్షన్లు పోయి మరమ్మతులకు వేలాది రూపాయాలు ఖర్చు చేసుకోవాల్సి వస్తోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే రోడ్డు మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ఎక్స్ రోడ్డు మధ్యలో భారీ గుంతలు

ఎన్టీపీసీలో దక్షిణ రీజియన్ స్పోర్ట్స్‌మీట్ ప్రారంభం

- క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఈడీ కేదార్ రంజన్


మార్చ్‌పాస్ట్ చేస్తున్న ఎన్టీపీసీ జట్లు

జ్యోతినగర్, జూలై 7: రామగుండం ఎన్టీపీసీలో ఆదివారం ఎన్టీపీసీ దక్షిణ రీజియన్ స్పోర్ట్స్ మీట్ (ఎస్ఆర్ఎస్ఎం) 2024 ఘనంగా ప్రారంభమైంది. పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని మహాత్మగాంధి స్టేడియంలో రామగుండం, తెలంగాణ ఎస్‌టిపిపి ఈడీ కేదార్ రంజన్ పాండు స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. ఈ స్పోర్ట్స్ మీట్‌లో దక్షిణ రీజియన్‌కు చెందిన రామగుండం, సింహాద్రి(విశాఖపట్నం) ఎన్టీపీసీ, కుడిగి ఎన్టీపీసీ (కర్నాటక), వల్లూర్(తమిళనాడు), ఎస్ఆర్‌హెచ్‌క్యూ(హైదరాబాద్) జట్లు పాల్గొంటున్నాయి. ఈ సందర్భంగా ఈడీ కేదార్ రంజన్ వివిధ జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడా జ్యోతిని వెలిగించి ఈనెల 10వరకు జరిగే పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. పురుషులకు క్రికెట్, మహిళా ఉద్యోగులకు బ్యాడ్మింటన్ ఈవెంట్లలో పోటీలు నిర్వహిస్తున్నారు. క్రికెట్ పోటీలు మహాత్మగాంధి స్టేడియంలో, బ్యాడ్మింటన్ పోటీలు స్పందన (సీనియర్ హాల్) ఇండోర్ స్టేడియంలో జరుగుతున్నాయి. ఎన్టీపీసీ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరుగుతున్న స్పోర్ట్స్ మీట్ ప్రారంభ కార్యక్రమంలో దక్షిణ రీజియన్ హెచ్ఆర్ సీజీఎం పాణిగ్రహి, ఎన్‌టీపీసీ సభ్యుడు బాబర్ సలీంపాషా, దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు చిన్మయి దాస్, స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు సంతోష్ తివారి, కార్యదర్శి భానేశ్వర్, గుర్తింపు కార్మిక సంగం అధ్యక్ష, కార్యదర్శులు యుగంధర్‌రావు, ఆరెపల్లి రాజేశ్వర్, ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

● **క్రీడలతో బహుళ ప్రయోజనాలు..**

క్రీడల వల్ల బహుళ ప్రయోజనాలున్నాయని, శారీరక, మానసిక ధారుఢ్యం పెంపొందుతుందని ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు అన్నారు. దక్షిణ రీజియన్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రాంభించిన అనంతరం ఈడీ ప్రసంగిస్తూ ఎన్టీపీసీ విద్యుత్ ఉత్పత్తితో పాటు క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. కోవిడ్ కారణంగా నాలుగేళ్లుగా ఎస్ఆర్ఎస్ఎం పోటీలను నిర్వహించ లేకపోయామని, భవిష్యత్‌లో క్రీడా టోర్నమెంట్లను నిర్వహిస్తామన్నారు. ఉద్యోగులు క్రీడలపై ఆసక్తి కనబర్చాలని తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు.

● **మొదటి మ్యాచ్‌లో రామగుండం గెలుపు..**

ఎస్ఆర్ఎస్ఎంలో భాగంగా మొదటి రోజు జరిగిన ప్రారంభ క్రికెట్ మ్యాచ్‌లో రావగుండం జట్టు కుడిగి ఎన్టీపీసీ జట్టుపై 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన కుడిగి జట్టు నిర్ణీత 12 ఓవర్లలో9 వికెట్లు కోల్పోయి 78 పరుగులు మాత్రమే చేసింది. 79 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన రామగుండం జట్టు 9.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించింది. రామగుండం బ్యాట్స్‌మెన్ వంశీ 19 బంతుల్లోనే 41 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కాగా, మహిళలకు జరిగిన బ్యడ్మింటన్ పోటీలలో సింగిల్స్, డబుల్స్‌లో రామగుండం ప్లేయర్లు గెలుపొందారు.


ఆత్మహత్య సంఘటనలో ఐదుగురిపై కేసు నమోదు


శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

ఓదెల, జూలై 7: మండలంలోని జీలకుంటలో వంగల శ్రీకాంత్‌రెడ్డి (36) ఆత్మహత్య సంఘటనలో ఆదివారం ఇదే గ్రామానికి చెందిన గొట్టే నాగరాజు, గొట్టే యశోద, గొట్టే స్రవంతి, దండు సదయ్య, రౌతు మనోజ్ క్రాంతివీర్‌పై ఆది వారం కేసు నమోదు చేశామని. పొత్కపల్లి ఎస్ఐ అశోక్‌రెడ్డి తెలిపారు. మృతుడి తల్లి వంగల సుజాత ఐదుగురు వ్యక్తులపై పొత్కపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వివరాలు ఇలా ఉన్నాయి. జీలకుంటకు చెందిన గొట్టే నాగరాజు, గొట్టే యశోద, గొట్టే స్రవంతి, దండు సదయ్య , రౌతు మనోజ్ క్రాంతి వీర్ కలిసి సర్వే నంబర్ 400/బి/2 లోని 2.15ఎకరాల వ్యవసాయ భూమిని అక్రమంగా కబ్జా చేయాలని కుట్రలు చేశారన్నారు. దీంతో సుల్తానాబాద్ కోర్టులో కేసువేసి ఇంజక్షన్ ఆర్డర్ తీసుకున్నామని, ఈ ఆర్డర్ వచ్చిన తరువాత కూడా తన కొడుకును బెదిరి స్తూ ఇష్టం వచ్చినట్లు చితకబాదారని సుజాత తెలిపింది. ఇకనుంచి భూమి కాడికి వస్తే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు పెడుతామని బెదిరించారని తెలిపారు. కొడుకుతో వ్యవసాయ పనులకు వెళ్లగా అక్కడ ఉన్నవారు తమవైపు చూస్తూ తీవ్రపదజాలంతో అవమానించారని, ఇది భరించలేక తన కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. చావుకు కారకులైనా వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి తల్లి వంగల సుజాత ఫిర్యాదులో పేర్కొంది.

ప్రకృతిరమణీయం పాండవుల లొంక

- పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని కోరుతున్న ప్రజలు


పాండవలొంక నుంచి పారే జలపాతం


బండలపై పాండవుల బొమ్మలు

కాల్వశ్రీరాంపూర్, జూలై 7: మండలంలోని జాఫర్‌ఖాన్‌పేట శివారులో ఉన్న పాండవుల లొంక వర్షాకాలంలో రామగిరికొండల నుంచి వచ్చే వర్షపునీరు పాండవలొంకలో జలపాతమై చూపరులను ఎంతో ఆకట్టుకుంటుంది. ఈ గుట్ట ప్రాంతంలో పాండవులు అరణ్యవాసం చేసినప్పుడు ఇక్కడే కొన్ని రోజులు నివాసమే ఏర్పాటు చేసుకొని ఉన్నట్లుగా పెద్దలు చెబుతుంటారు. అందుకే దీనిని పాండవలొంక అని పేరు వచ్చిందని చుట్టుపక్కల గ్రామస్థులు తెలుపుతున్నారు. పాండవ లొంకలో పాండవుల బొమ్మలతో పాటు ఆంజనేయ స్వామి విగ్రహం, జలపాతం, పచ్చని చెట్లతో వర్షాకాలంలో ఈ ప్రాంతమంతా ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. జాఫర్‌ఖాన్‌పేటకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ పాండవలంక ప్రాంతానికి వెళ్లేందుకు రెండు కిలోమీటర్ల వరకు మట్టి రోడ్డు వేశారు. మరొక కిలో మీటర్ వెళ్లేందుకు దారి లేక కొండల ప్రాంతం నుంచే నడిచి పాండవులొంకకు పర్యాటకులు చేరుకుంటారు. పాండవ లొంకను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని 20సంవత్సరాలుగా ఆ ప్రాంతవాసులు సంబంధిత ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నోసార్లు విన్నవించారు. విన్నపాలు కాగితాల వరకే పరిమితమయ్యాయని జాఫర్‌ఖాన్‌పేట, కునారం గ్రామస్తులు పేర్కొంటున్నారు. శ్రావణమాసంలో జాఫర్‌ఖాన్‌పేట, కూనారం గ్రామ ప్రజలు పాండవలొంకకు వనభోజనాలకు వెళుతుంటారు. రామగిరి కొండలనుంచి పారే నీరు జలపాతమై పాండవలంక నుంచి జారి పడుతుంటే ఆ జలపాతం కింద స్నానాలు చేస్తూ ఆనంద ఉత్సవాలతో పర్యాటకులు ఆ ప్రాంతంలో గడుపుతుంటారు. అటవీ ప్రాంతం నుంచి వచ్చే నీరు ఎన్నో వనమూలికలతో కలవడంతో సర్వరోగ నివారిణి ఆ నీరు అనుకొని చుట్టుపక్కల వారు ఆ నీటిని తెచ్చుకొని తాగుతుంటారు. పాండవలొంక ప్రాంతం వెన్నంపల్లి, జాఫర్‌ఖాన్‌పేట, కూనరం ఈ మూడు గ్రామాలకు దగ్గరగా ఉంటుంది. జాఫర్‌ఖాన్‌పేట నుంచే దారి ఉన్న కారణంగా పర్యాటకులు వర్షాకాలంలో ఈ ప్రాంతాన్ని సందర్శిస్తుంటారు. జాఫర్‌ఖాన్‌పేట గ్రామం నుంచి పాండవ లొంక ప్రాంతం వరకు రహదారిని నిర్మించి, ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఈ ప్రాంతాన్ని సందర్శించిన పర్యాటకులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ప్రభుత్వం కోరుతున్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకుల అరెస్ట్

పాలకుర్తి, జూలై 7: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కన్నాల టోల్ ప్లాజా వద్ద అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆదివారం బసంత్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. టోల్ ప్లాజా వద్ద స్థానిక పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా కనిపించిన రామరావుపల్లి గ్రామానికి చెందిన రావుల నవీన్, గొల్లపెల్లి నరేంద్రలను తనిఖీ చేశారు. వారి వద్ద గంజాయి లభించినట్లు, వారు మహారాష్ట్ర ప్రాంతం నుంచి తీసుకువస్తునట్లు తెలిసిందని పోలీసులు తెలిపారు.

గంజాయి సరఫరా నిందితులపై కేసు


రామగిరి, జూలై 7: గంజాయి సరఫరా చేస్తూ పట్టుబడిన ఐదుగురు నిందితులను ఆదివారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు రామగిరి పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సందీప్‌కుమార్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మండలంలోని లద్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఓసీపీ-2 వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా నాగేపల్లి గ్రామానికి చెందిన కొండవేన అనిల్, తన స్నేహితులు కొండపాక రవికిరణ్, జాడి రాజేష్, ఎరుకల భాస్కర్, సుతారి శ్రీకాంత్ అనే వ్యక్తులు మోటర్ సైకిల్స్‌పై శనివారం నాగేపల్లి ఎక్స్‌రోడ్ వైపు గంజాయి విక్రయానికి వెళ్తుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుపడినట్లు సీఐ తెలిపారు. వారి వాహనాలతో పాటు సెల్‌ఫోన్‌లను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. నిందితుల వద్ద పట్టుకున్న గంజాయి విలువ రూ. 75,000 వరకు ఉంటుందని అంచనా వేశారు. నిందితులపై కేసు నమోదు చేసి మంథని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఎవరైనా గంజాయి అమ్మడం కానీ తాగడం చేసినట్లైయితే చర్యలు చేపడతామని సీఐ హెచ్చరించారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి


వేణు(ఫైల్)

పెద్దపల్లిటౌన్, జూలై 7: లారీ ఢీకొన్న ఘటనలో ఆదివారం ఓ వ్యక్తి మృతి చెందాడు. జిల్లా కేంద్రంలోని హన్మాన్‌నగర్‌కు చెందిన కాసనగొట్టు వేణు(50) ఎల్ఐసీ ఏజెంటుగా, మెడికల్ స్టోర్ నడుపు కుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం కమాన్‌పూర్ మండలం గుండారం వెళ్తుండగా మంథని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద మంథని వైపు మలుపు తిప్పుతుండగా గోదావరిఖని నుంచి వస్తున్న బూడిద ట్యాంకర్ లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో వేణుకు తీవ్ర గాయాలు కాగా కరీంనగర్‌కు తరలించారు. అక్కడి ఆస్పత్రి వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. మృతుడు వేణు భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కొడుకులు సాయివిఘ్నేష్, అనీష్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం


శంకర్(ఫైల్)

సుల్తానాబాద్, జూలై 7: సుల్తానాబాద్ పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. సుల్తానాబాద్ సుభాష్‌నగర్‌కు చెందిన న్యాతరి శంకర్ (50) అనే వ్యక్తి కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం రాత్రి కూలీ పని చేసుకుని ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా యాదవనగర్ రైల్వేస్టేషన్ రోడ్డు వైపు వస్తున్న భారీ క్రేన్ ఢీకొంది. దాంతో శంకర్ అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడికి భార్య రజితతో పాటు కూతురు స్వప్న, కొడుకు శ్రీనివాస్ ఉన్నారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ప్రమాదం జరిగిన తీరు ఆరా తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ అస్పత్రికి తరలించారు.

కన్నుల పండవగా పెద్దమ్మ బోనాల జాతర





బోనాల శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు, బోనం ఎత్తుకున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

కోరుట్ల, జూలై 7: ఆషాడమాసం పురస్కరించుకోని పట్టణంలోని ముదిరాజు సంఘ ఆద్వర్యంలో ఆదివారం నిర్వహించిన పెద్దమ్మ బోనాల జాతర కన్నుల పండవగా సాగింది. పట్టణంలోని ముదిరాజు సంఘ సభ్యుల ఆద్వర్యంలో అయిలాపూర్ రోడ్డులోని పెద్దమ్మ దేవాలయంలో పోతరాజులు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించంగా మహిళలు బోనాల నెత్తిన పెట్టుకోని శోభయాత్ర నిర్వహించారు. శోభయాత్ర పట్టణంలోని పలు వార్డుల నుండి శోభయాత్రగా అయిలాపూర్ రోడ్డు వద్దకు వచ్చిన బోనాలతో వచ్చిన మహిళలు సమూహంగా ఏర్పిడి పెద్దమ్మ దేవాలయం వరకు శోభయాత్ర నిర్వహించారు. శోభయాత్రలో పోతరాజుల నృత్యాలు అకటుకున్నాయి. వర్షాలు విరివిగా కురిసి పంటలు బాగా పండి ప్రజలు ఆరోగ్యవంతుగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళలు పెద్దమ్మకు బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జు జువ్వాడి నర్సింగ రావులు వేరువేరుగా బోనం ఎత్తుకొని అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కాగా బోనాల జాతరతో అయిలపూర్ రోడ్డు పూర్తిగా సందండిగా మారింది. ఈ కార్యక్రమంలో ముదిరాజు సంఘ నాయకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని కొంగు బంగారంగా కొలిచిన వారి కోరికలు తీర్చే పెద్దమ్మతల్లిగా పేరుగాంచిన ఆలయం బోనాల జాతరను ముదిరాజ్‌లు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయంలోని అమ్మవారిని ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకోని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులు భక్తి శ్రద్ధలతో బోనం తయారు చేశారు. బోనంను నెత్తిన ఎత్తుకోని డప్పుచప్పుల మధ్య పెద్ద సంఖ్యలో భక్తులు ఊరేగింపుగా మంగళహారతులతో పెద్దమ్మతల్లి ఆలయంకు బయలు దేరారు. బోనంతో భక్తులు ఆలయం చుట్టు ప్రదిక్షణాలు చేసి సమర్పించుకోని మొక్కలు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కోరుట్ల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావులు బోనం నెత్తిన ఎత్తుకొన్ని భక్తులతో ఊరేగింపులో పాల్గొన్నారు. అమ్మ వారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, ముదిరాజ్ కుల సంఘం సభ్యులు, భక్తులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

● ఘనంగా పోచమ్మ బోనాలు..

కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామంలో ఆధివారం పోచమ్మ బోనాల జాతర ఘనంగా జరిగింది. గంగపుత్రలు చేప వల, ద్యావతి రాజులు పోతరాజుల విన్యాసాలు డప్పు చపుల్ల మధ్య బోనాల శోభయాత్ర గ్రామస్తులు జరిపారు. గ్రామంలోని పురవీదుల గుండా బోనాల శోభయాత్రను మహిళలు నిర్వహించంగా పోతరాజుల నృత్యాలు అకట్టుకున్నాయి. గ్రామ శివారులోని పోచమ్మ దేవాలయం వరకు మహిళలు బోనాల శోభయాత్ర నిర్వహించి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు విరివిగా కురిసి పంటలు బాగా పండాలని ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం వనబోజన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు గ్రామంలో ఆదివారం అన్నీ కుల సంఘాల ఆద్వర్యంలో పోచమ్మ బోనాలతో పాటు వనభోజనాలు చేపట్టారు. అషాడం అరంభం కావడంతో గ్రామంలోని గ్రామాభివృద్ధి కమిటీ ఆద్వర్యంలో అన్నీ కుల సంఘాల ఆద్వర్యంలో ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలతో డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా గ్రామంలోని పోచమ్మ ఆలయానికి వెళ్లి బోనాలతో నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించి ఈ వర్షాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవాలంటూ ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పోచవేని సత్యఎల్లయ్యతో పాటు అన్నీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మెట్‌పల్లిలో బోనాలతో మహిళలు



బోనం సమర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

వైభవంగా జగన్నాథ రథయాత్ర



రథయాత్రలో స్వామి వారి హారతి తీసుకుంటున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి, జూలై, 7: పట్టణంలో హరే రామా హరే కృష్ణ నామశారంతో జగన్నాథ రథయాత్ర వైభవంగా జరిగింది. ఆదివారం పట్టణంలోని కీర్తి ఫంక్షన్ హాల్ వద్ద రథంలో బలరాముడు, సుభద్రదేవి, జగన్నాథ ఉత్సవమూర్తులను ఏర్పాటు చేసిన కృష్ణం వందే జగద్గురుం పెద్దాపూర్ ఇస్కాన్ భక్తులు రథయాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణంలోని అయ్యప్ప టెంపులు మీదుగా పోలీసుస్టేషన్, కొత్తబస్టాడ్, పాత బస్టాండ్, రాజకళమందిర్, ఏఎంసీ మార్కెట్, బస్‌డిపో మీదుగా వెంకట్ రెడ్డి వరకు రథయాత్ర కార్యక్రమాన్ని భక్తులు నిర్వహించారు. పట్టణంలోని పురవీధులన్ని సర్వాంగా సుందరంగా ముస్తాబు చేస్తూ అందమైన ముగ్గులు వేశారు. రథయాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మరె రామా హరే కృష్ణ అంటూ తాడును లాగుతూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పాల్గొని స్వామి వారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించి హారతీ స్వీకరించారు. అనంతరం యాత్రలో పాల్గొని పురవీధులను శుభ్రం చేశారు. అదే విధంగా కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి నర్సింగరావు పాల్గొన్నారు. స్వామి వారి సంకీర్తనం, ప్రవచణం, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య మంగళ హారతిలతో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులతో వారు కలిసి రథయాత్రాన్ని లాగుతూ ముందుకు సాగారు. అనంతరం భక్తుకలు అన్న ప్రసాదం అందజేశారు. యాత్ర విజయవంతంగా జరగడానికి మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, ఇస్కాన్ నిర్వహకులు, తదితరులు పాల్గొన్నారు.



రథయాత్రలో పాల్గొన్న భక్తులు

తాడిచెట్టు పైనుంచి పడి
గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూలై 7: తాటి చెట్టు పై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి గీతా కార్మికుడు పొన్నం దేవరాజ్ గౌడ్ తీవ్ర గాయాల పాలైన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. గ్రామంలోని దేవరాజుగౌడ్ గీతా కార్మిక వృత్తిలో కొనసాగుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజులాగే కల్లు తీసేందుకు గ్రామ శివారులోని తాటి చెట్ల వద్దకు వెళ్లాడు. చెట్టు పైకెక్కి తీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడ్డాడు. అక్కడే ఉన్న పలువురు గీత కార్మికులు తీవ్ర గాయాల పాలైన దేవరాజుగౌడ్‌ను సిరిసిల్ల లోని ఆసుపత్రికి తరలించారు. అతని ఎడమకాలు విరిగిపోయింది. కాగా దేవరాజ్ గౌడ్ కు మెరుగైన వైద్యం అందించడంతోపాటు ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గీతా కార్మిక సంఘం నాయకులు మల్లేష్, సతీష్, కృష్ణ స్వామి ,ఎల్లయ్య, దేవయ్య, ప్రభాకర్ లు కోరారు.

ద్విచక్రవాహనంతో పరారీ..
పట్టుకున్న యువకులు

మల్యాల, జూలై 7: పంట చేల వద్ద నిలిపిన ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తి తీసుకొని పరారీ కావడంతో యువకులు వెంబండించి పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మండలంలోని ముత్యంపేటకు చెందిన శ్రీనివాస్‌రావు అనే రైతు మల్యాల క్రాస్ రోడ్డు సమీపంలో పంట చేల వద్ద తన ద్విచక్రవాహనంను నిలుపగా ఓ వ్యక్తి దాన్ని తీసుకొని జగిత్యాల వైపు వెళ్లాడు. మల్యాల క్రాస్ రోడ్డు వద్ద వాహనాన్ని గుర్తుపట్టిన కొందరు యువకులు వెంబడించారు. అయితే అతివేగంతో వెతుతుండడం వల్ల అదుపుతప్పి పడిపోవడంతో నూకపల్లి స్టేజి వద్ద వాహనంతో పాటు సదరు వ్యక్తి పట్టుబడ్డాడు. దీంతో అతన్ని పోలీసులకు అప్పగించారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ ప్రాంత వాసిగా ఆ వ్యక్తి తన వివరాలు తెలిపాడు.

ఎస్సారెస్పీలోకి 2,315 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఆదివారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి 2,315 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 90.323 సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 11.702 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇదిలా ఉండగా జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 5.680 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

వరదకాలువకు మరమ్మతులు కరువు

● కోతలకు గురవుతున్న కాలువ ● బ్రిడ్జిలపై ప్రమాదకరంగా గోతులు ● పొంచి ఉన్న ప్రమాదం.. పట్టని అధికారులు



ముత్యంపేట శివారులో వంతెనపై ప్రమాదకర గోతులు



రామన్నపేట శివారులో కాలువలో వేసిన ఇసుక మేటలు

మల్యాల, జూలై 7: వరదకాలువ మరమ్మతులకు నోచుకోవడం లేదు. కాలువ పక్కల కోతలకు గురవుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. కాలువపై రాకపోకలకు ఏర్పాటు చేసిన బ్రిడ్జిలపై ప్రమాదకరంగా గోతులు ఏర్పడి ప్రమాదాలు జరుగడమే కాకుండా బ్రిడ్జిలకు ప్రమాదం పొంచి ఉన్నా నిర్లక్ష్యం వహించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రాంపూర్ నుంచి సర్వాపూర్ వరకు దాదాపు 10 కిలోమీటర్లకు పైగా వరద కాలువ ఉండగా రామన్నపేట, నూకపల్లి, మల్యాల, ముత్యంపేట, సర్వాపూర్ తదితర గ్రామాల వద్ద కాలువ వర్షపు నీటికి కోతలకు గురైంది. కోతలకు గురి కావడంతో పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. నూకపల్లి శివారులో గతంలో పెద్ద ఎత్తున కోతకు గురి కావడంతో అధికారులు తాత్కలిక మరమ్మతులు చేపట్టిన్నప్పటికీ మిగితా చోట్ల ఎలాంటి మరమ్మతులు చేయలేదు. దీంతో రామన్నపేట, మల్యాల శివారులో కోతలకు గురైన చోట కాలువలో ఇసుక కుప్పలు ఏర్పడ్డాయి. కాగ వర్షాకాలంలో నూకపల్లి శివారులో గ్రామం పక్కనే కాలువ ఉండడంతో గ్రామంలోని నీరు కాలువలోకి వెళ్లడం, కాలువ పొంగడంతో గ్రామస్తులు ప్రతి ఏటా బిక్కుబిక్కుమంటున్నారు. అయిన అక్కడ కాలువను పూడ్చివేసే చర్యలు తీసుకోకపోవడంతో గ్రామస్థులు మండిపడుతున్నారు.

● బ్రిడ్జిలపై ప్రమాదకర గోతులు..

వరదకాలుపై గత బ్రిడ్జిలపై ప్రమాదకరంగా గోతులు ఏర్పడ్డాయి. రామన్నపేట, మల్యాల, ముత్యంపేట, సర్వాపూర్ గ్రామాల వద్ద కాలువ వంతెనల వద్ద ప్రమాదకరంగా గోతులు ఏర్పడ్డాయి. వర్షపు నీరు వెళ్లకుండా వ్యర్థాలు నిండిపోవడంతో వంతెనపైనే నీరు నిలుస్తున్నాయి. దీంతో వంతెనపై గోతులు ఏర్పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కనీస మరమ్మతులు చేయకపోవడం, బ్రిడ్జిలపై కంకర, స్టీలు తేలి ద్విచక్రవాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవతున్నారు. ఇప్పటికైనా అధికారులు మరమ్మతు చర్యలు చేపట్టాలని ప్రజాప్రతినిధులు కూడా చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

వేములవాడ నుంచి
అరుణాచల క్షేత్రానికి లగ్జరీ బస్సు

భగత్‌నగర్, జూలై 7: వేములవాడ నుంచి తమిళనాడులోని అరుణాచల క్షేత్రానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు కరీంనగర్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎన్.సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21న గురుపౌర్ణమిని పురస్కరించుకొని 19వ తేదీ రాత్రి 8 గంటలకు వేములవాడలో బయలుదేరిన బస్సు 9 గంటలకు కరీంనగర్ చేరుకుంటుందన్నారు. కరీంనగర్ నుంచి అరుణాచల క్షేత్రానికి వెళ్లే దారిలో కాణిపాకం వరసిద్ధి వినాయక దేవస్థానం, తమిళనాడులోని వేలూర్ శ్రీ మహాలక్ష్మి టెంపులు గోల్డెన్ టెంపుల్ దర్శనం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. 20న శనివారం రాత్రి అరుణాచల క్షేత్రానికి చేరుకుంటుందన్నారు. అరుణాచల గిరి ప్రదక్షిన దర్శనం అనంతరం 21న సాయంత్రం 5 గంటలకు బయలుదేరి తిరుగు ప్రయాణంలో గద్వాల అలంపూర్‌లోని జోగు లాంబ దేవస్థానం మీదుగా 22వ తేదీ ఈసాయంత్రం 6 గంటలకు కరీంనగర్ నుంచి వేములవాడ చేరుతుందన్నారు. ఈ ప్రత్యేక బస్సులో పెద్దలకు 4,500 రూపాయలు, పిల్లలకు 3800 రూపాయల ఛార్జీలు వసూలు చేస్తారన్నారు. ముందస్తు రిజర్వేషన్ కోసం ఆర్టీసీ వెబ్‌సైట్‌లో సర్వీసు నంబర్ 75555ను ఎంపిక చేసుకుని ముందస్తు రిజర్వేషన్ చేసుకోవాలన్నారు.

అలుగునూర్‌లో దొంగల బీభత్సం

- ఓ ఇంట్లో, ఆలయంలో దొంగతనం
- బంగారం, నగదు అపహరణ



ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీం

తిమ్మాపూర్, జూలై 7: మండలంలోని అలుగునూర్‌లో దొంగలు బీభత్సం సృష్టించారు. రాజీవ్ రహదారికి సమీపంలో ఉన్న ఓ ఇంట్లో, ఎల్లమ్మ ఆలయంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఎల్ఎండీ ఎస్ఐ చేరాలు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అలుగునూర్‌లోని సింగిరెడ్డి అనంతరెడ్డి ఆదివారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కి వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళంతో పాటు ఇంట్లో ఉన్న బీరువ పగలగొట్టి ఉన్నట్లు గమనించి ఎల్ఎండీ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ ఎస్సై చేరాలు, క్లూస్ టీం సహకారంతో దర్యాప్తు చేశారు. ఇంట్లో నుంచి ఐదు తులాల బంగారం, 23వేల నగదు చోరీకి గురైంది. అదేవిధంగా అలుగునూర్‌లోని ఎల్లమ్మ ఆలయంలో అర్ధరాత్రి ఓ దొంగ ఆలయంలోకి చొరబడి దొంగతనానికి పాల్పడ్డట్లు గుర్తించారు. ఆలయం ద్వారాలు తాళాలు పగళగొట్టి ఉండటంతో అనుమానం రాగా లోనికి వెళ్లి పరిశీలించగా ఆలయంలో ఉండే హుండీని పగల గొట్టి ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. దొంగతానానికి సంబంధించి సీసీ ఫుటేజ్‌లో ఒక వ్యక్తి ఆలయం తాళాలు పగలగొట్టి ఆలయంలోకి ప్రవేశించి దొంగతనానికి పాల్పడ్డట్లు గుర్తించారు. ఆలయంలో మూడు గ్రాముల బంగారం, ఐదు వేల రూపాయలు చోరీ జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు ఎల్ఎండీ ఎస్సై చేరాలు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నిర్మించారు.. నిర్లక్ష్యంగా వదిలేశారు

- మినీట్యాంక్ బండ్‌కు నిర్వహణ కరువు

చొప్పదండి, జూలై 7: నియోజకవర్గానికి ఒక మినిట్యాంక్ బండ్‌ను నిర్మించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా చొప్పదండిలో కోట్లాది రూపాయలతో చేపట్టిన మినిట్యాంక్ బండ్ నిర్లక్ష్యానికి గురవుతోంది. 2017లో రాష్ట్రప్రభుత్వం చొప్పదండి నియోజకవర్గ కేంద్రానికి ఒక మినీట్యాంక్ బండ్‌ను మంజూరు చేసింది. చొప్పదండి నియోజకవర్గ కేంద్రంలో నిర్మించాల్సిన మినీట్యాంక్‌బండ్‌ను రేవెల్లిలో పనులు చేపట్టారు. మిషన్ కాకతీయలో భాగంగా చెరువును మినీట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దారు. రాజకీయ కారణాల కారణంగా నియోజకవర్గ కేంద్రమైన చొప్పదండిలోని కుడి చెరువును కాదని రెవెల్లి పెద్ద చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా ప్రకటించి అభివృద్ధి చేశారు. మండలంలోని రెవెల్లిలో పెద్ద చెరువును 2017లో ఆరు కోట్ల 55 లక్షలతో మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేశారు. ఈ నిధులతో చెరువులోని పూడిక మట్టిని తొలగించి కట్టను బలపరిచారు. కట్టపై రెయిలింగ్, ఫుట్‌పాత్, వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేశారు. పెద్ద చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దారు. ఆ తర్వాత నిర్వాహణ మరిచారు. ప్రస్తుతం మినీ ట్యాంక్ బండ్ రూపు కోల్పోయింది. రెయిలింగ్ మొత్తం తుప్పు పట్టిపోగా, వాకింగ్ ట్రాక్ పగుళ్లు ఏర్పడ్డాయి. పిచ్చిమొక్కలు పెరిగి నడవలేని పరిస్థితి ఏర్పడింది. చెరువు కట్ట వర్షాలకు కోతకు గురికాగా ఆరేళ్లుగా ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. మినీట్యాంక్ బండ్‌పై ఎలాంటి ఆహ్లాదకరమైన వాతావరణం లేకపోగా చెరువుకట్ట సైతం బలహీనపడుతోంది. మినీ ట్యాంక్‌బండ్‌పై లైటింగ్, చిన్నారులకు ఆట వస్తువులు ఏర్పాటు చేయాల్సి ఉండగా నిధులు సరిపోక ఏర్పాటు చేయలేదు. రాత్రిపూట మాత్రం మినీ ట్యాంక్ బండ్ మందుబాబులకు అడ్డాగా మారిందని గ్రామస్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మినీ ట్యాంక్‌బండ్‌కు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెరువుకట్టను మరమ్మతు చేసి అభివృద్ధి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



నిరుపయోగంగా మారిన ట్రాక్



కోతకు గురవుతున్న చెరువు కట్ట

కొండగట్టులో కోరుట్ల వాసి ఆత్మహత్యాయత్నం

మల్యాల, జూలై 7: దిగువ కొండగట్టులోని బస్‌స్టాండ్ వద్ద కోరుట్లకు చెందిన ఓ వ్యక్తి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకోగా స్థానిక నాయకులు 108, పోలీసులకు సమాచారం అందించడంతో పాటు ఆసుపత్రికి తరలించారు. కోరుట్ల ప్రకాష్ నగర్‌కు చెందిన వాసాల వేణు అనే వ్యక్తి క్రిమిసంహారక మందు తాగి పడిపోయి వాంతులు చేసుకుంటున్నాడు. మాజీ ఎంపీపీ దారం ఆదిరెడ్డి, స్థానికులు గమనించి డయల్ 100, 108కు సమాచారం అందించారు. దీంతో బ్లూకోల్ట్స్ పోలీసులు సంపత్ అక్కడకు చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. అతన్ని చికిత్స కోసం అంబులెన్స్‌లో జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నట్లు తెలిసింది.

బాలుడిని కొట్టిన ఆయాకు మెమో జారీ

కథలాపూర్, జూలై 7 : మండలంలోని బొమ్మెనలో అంగన్‌వాడీ కేంద్రంలో శ్రీనాథ్ అనే బాలుడిని చెంపపై కొట్టిన ఘటనలో ఆయా రాజనర్సుకు మెమో జారీ చేసినట్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక తెలిపారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించి ఆలనా, పాలనా చూసుకోవాల్సిన ఆయా బాలుడిని కొట్టి తీవ్రంగా గాయపరిచినట్టు ఐసీడీఎస్ అధికారులతో పాటు తహసీల్దార్, ఎంపీడీఓ, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు బాధితుని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దీంతో మెట్‌పల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ తిరుమలాదేవి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఈ సంఘటనపై ఆయాకు మెమో జారీ చేసి వాంగ్మూలం కోరినట్టు తెలిపారు.

డబ్బులు తీసుకొని పారిపోయిన డ్రైవర్ అరెస్టు



డ్రైవర్ అరెస్టును చూపుతున్న పోలీసులు

జగిత్యాల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): యజమానికి మోసం చేసి డబ్బులతో పారిపోయిన డ్రైవర్‌ను జగిత్యాల పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో సీఐ వేణుగోపాల్ అరెస్టు వివరాలను వెల్లడించారు. హైదరాబాద్ నగరానికి చెందిన ఛైల్ సింగ్ తెలంగాణ ప్రాంతానికి ఫైబ్రోస్ ఎలక్ట్రికల్ కంపెనీకి డిస్ట్రిబ్యూటర్‌గా ఉన్నాడు. తన కంపెనీ లావాదేవీలకు సంబంధించిన విషయంలో ఛైల్ సింగ్ స్వయంగా వెళ్లి కలెక్షన్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రాజస్థాన్ ప్రాంతానికి చెందిన దయరాం సింగ్‌ను ఏడాది క్రితం తన కారు డ్రైవర్‌గా ఛైల్ సింగ్ నియమించుకుని వ్యాపారం చేస్తున్నాడు. గత నెల 26వ తేదీన ఛైల్ సింగ్ నిజామాబాద్, ఆదిలాబాద్ తదితర పట్టణాల్లో తన కంపెనీకి సంబంధించిన కలెక్షన్ చేసుకుని జగిత్యాలకు చేరుకున్నారు. కారును యావర్ రోడ్డులోని పార్క్ వద్ద పార్కింగ్ చేసి ఛైల్ సింగ్ కలెక్షన్ కోసం వెళ్లి తిరిగి వచ్చేసరికి కారులో ఉన్న డ్రైవర్ దయరాం సింగ్ కనబడలేదు. కలెక్షన్ చేసిన రూ. 15 లక్షల నగదుతో తన డ్రైవర్ దయారాం సింగ్ తనను మోసం చేసి ఉడాయించాడని పోలీసులకు ఫిర్యాదు చేయగా జగిత్యాల టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఆదివారం జగిత్యాల బస్టాండులో గాలింపులు జరుపుతుండగా అనుమానాస్పదంగా దయారాం పట్టుబడ్డాడు. అతని వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా రూ. 12.10 లక్షలు నగదు, రెండు బిల్ బుక్స్ ఉన్నట్లుగా గుర్తించారు. నగదును స్వాధీనం చేసుకొని, దయారాంను అరెస్టు చేసినట్లు పోలీసులు వివరించారు.

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం..
మెట్‌పల్లి యువకుడి మృతి



బాసని వంశీ(ఫైల్)

మెట్‌పల్లి, జూలై, 7: మెట్‌పల్లి పట్టణానికి చెందిన బాసని వంశీ(20) అను యువకుడు హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు స్నేహితులు ఆదివారం తెలిపారు. పట్టణానికి చెందిన బాసని రవి, లక్ష్మి దంపతుల కుమారుడు హైదరాబాద్‌లోని ప్రైవేట్ కళాశాలలో బీటెక్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. శనివారం రాత్రి బాలు అను మిత్రునితో కలిసి ద్విచక్ర వాహనంపై అమీర్‌పేట నుంచి మెహిదీపట్నంకు బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపుతప్పి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నగా బాసని వంశీ అక్కడికక్కడే మృతి చెందగా బాలు గాయాలపాలైనాడు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడాని తెలియడంతో కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి.

మరమ్మతుకు మోక్షమెప్పుడో?



తీగల వంతెనను ప్రారంభించి ఏడాది అయినప్పటికీ నిర్వహణ లోపంతో రోడ్డుపై వర్షపు నీరు నిలిచి బురదమయంగా మారింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

ప్రింట్ మీడియా సర్క్యులేషన్ అసోసియేషన్ కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

కరీంనగర్ టౌన్, జూలై 7: ప్రింట్ మీడియా సర్క్యులేషన్ అసోసియేషన్ కరీంనగర్‌శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో సభ్యులు సమావేశమై భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించుకొని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా మాటేటి రవీందర్, అధ్యక్షుడిగా మంచాల రాజు, ప్రధాన కార్యదర్శిగా రంగిశెట్టి శ్రీనివాస్, కోశాధికారిగా ఇరుమల్ల రమేశ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా చిందం రాజేంద్రప్రసాద్, అమర్‌పాల్‌రెడ్డి, పూసల శ్రీనివాస్, పింగళి నరేందర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా అలిగిరెడ్డి సతీష్‌రెడ్డి, ఏనుగుల ఓంకార్, కార్యవర్గ సభ్యులుగా గుండ రాజేంద్రప్రసాద్, శ్రీపాద వెంకటేశ్, మొండయ్య, సంతోష్‌రెడ్డి, రమేశ్, మధుకర్, వేణుగోపాలచారి, సంపత్‌లను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఏజెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది లక్ష్మీనారాయణ, పచ్చునూరి రాజేందర్ సన్మానించారు.

'స్మార్ట్‌సిటీ పనుల్లో అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధం'

కరీంనగర్ అర్బన్, జూలై 7: కరీంనగర్ స్మార్ట్‌సిటీ పనులలో మేయర్ సునీల్‌రావు పాల్పడిన అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధమని కాంగ్రెస్ కార్పొరేటర్లు, నాయకులు సవాల్ విసిరారు. మేయర్ సునీల్‌రావు కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావుపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివారం డీసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటరు, నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 300 కోట్ల స్మార్ట్‌సిటీ నిధుల్లో మేయర్ సునీల్‌రావు 10 కోట్లు కమిషన్ తీసుకున్నారా..? కాంగ్రెస్ పార్టీలో చేరినందుకు తాము 10 లక్షలు తీసుకున్నామా..? దీనిపై మున్సిపల్ కార్యాలయం ఎదుట బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆకుల ప్రకాష్, మాజీ కార్పొరేటర్ కాశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు సరిల్ల ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు పిట్టల శ్రీనివాస్, ఆకుల నరసయ్య, వైద్యుల అంజన్ కుమార్, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చదరంగ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 7: కరీంనగర్ జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి ఓపెన్ అండర్-13 చదరంగ పోటీలు ఆదివారం ముగిశాయి.విజేతలకు లక్ష్మీనర్సింహా కన్వెషన్ నిర్వాహకులు నర్సింహరెడ్డి, లక్ష్మారెడ్డి, జీనియస్ చెస్ అకాడమి వ్యవస్థాపకుడు కంకటి కనుకయ్యలు ట్రోఫీలను, నగదు బహుమతులను అందజేశారు. ఓపెన్ కేటగిరీలో సీటీ శ్రీనివాస్, సిహెచ్.కార్తీక్‌సాయి, మోహన్‌లు, జూనియర్స్ కేటగిరిలో రిషిపాల్గుని, కె.నీరగ్, సిహెచ్.కశ్యపు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో జీనియస్ చెస్ అకాడమి కోచ్ నిర్వాహకుడు కంకటి అనూప్‌కుమార్, అనిత, ఫణీత్, కుమార్, సతీష్, సృజన్, ఆర్బిటర్లు సంపత్, అనిల్, తరుణ్ పాల్గొన్నారు.

ఒత్తిడితోనే కాంగ్రెస్‌పై సునీల్‌రావు అనుచిత వ్యాఖ్యలు

కరీంనగర్ అర్బన్, జూలై 7: మేయర్ సునీల్‌రావు ఏ పార్టీలోకి వెళ్లాలో అర్థం కాని ఒత్తిడిలో కాంగ్రెస్ నాయకుడు రాజేందర్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని టీపీసీసీ కార్యదర్శి అంజన్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు.

మానేరుకు జలకళ



నిండుగా ప్రవహిస్తున్న మానేరు వాగు

జమ్మికుంట, జూలై 7: జమ్మికుంట మండల పరిధిలోని మానేరు వాగులో జలకళ సంతరించుకుంది. వేసవి కాలంలో చుక్క నీరు లేకుండా కనిపించిన మానేరు తీరం ఇటీవల కురిసిన వర్షాలకు నిండు కుండను తలపిస్తుంది. సాయంకాల సమయంలో ఆకాశంలో కమ్ముకొచ్చిన మేఘాలు.. మానేరు తీరం రెండు ఒకే చోట కలిశాయా అన్న విధంగా చూపరులను కట్టిపడేశాయి. ఈ ఆహ్లాదకరమైన వాతవరణాన్ని చూసేందుకు ప్రజలు ఆసక్తి కనబరిచారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వీణవంక, జూలై 7: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల 1987-88 వ సంవత్సర పదోతరగతి పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. దాదపు 36 సంవత్సరాల తర్వాత తమ తోటి మిత్రులను కలుసు కోవడంతో ఆత్మీయంగా పలకరించుకున్నారు. పాఠశాలతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయిలను సన్మానించారు. కార్యక్రమములో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయిలు పాల్గొన్నారు.

మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా బిర్జ ఆరిఫ్ బేగ్



నియామక పత్రాన్ని అందజేస్తున్న మండలాధ్యక్షుడు బసవయ్య

శంకరపట్నం, జూలై 7: శంకరపట్నం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య ఆధ్వర్యంలో కేశవపట్నం టౌన్ మైనార్టీ అధ్యక్షుడిగా మిర్జ ఆరిఫ్ బేగ్‌ను నియమించారు. అనంతరం నియామక పత్రం అందించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దుర్గం తిరుపతి, బొజ్జ చంద్రమౌళి, కల్లెపల్లి రాజయ్య, అమీర్, సదానందం, షారుక్, అయాన్, ప్రశాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు లేక ముందుకు సాగని వరినాట్లు

-అయోమయంలో పలువురు అన్నదాతలు

కరీంనగర్‌రూరల్, జూలై7: రోహిణి కార్తితో ప్రారంభం అయ్యే వర్షాకాలం కాస్తా ఆలస్యం అయ్యింది. రోహిణి, మృగశిర, ఆరుద్ర కార్తె దాటి పోయినప్పటికీ వర్షాలు కురవకపోవడంతో రైతులు అయోమయంలో పడ్డారు. కనీసం నారు పోయ డానికి కూడా సరైన నీరు బావుల్లో లేకపోవ డంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గత యేడాది ఈసమయంలో వర్షాలు సమృద్ధిగా పడి బావుల్లో నీరు చేరింది. తద్వారా రైతులు నార్లు పోసుకుని నాట్లు కూడా పూర్తి చేసుకున్నారు. ప్రస్తుతం మాత్రం పరిస్థితి గందరగోళంగా మారిం ది. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు, బావుల్లో నీరు చేరితే పంటలకు నీరందుతుంది. వర్షాలు తక్కువ పడితే సాగు కాస్తా తగ్గుముఖం పడుతుంది. దాదాపు నెలరోజుల పాటు వానాకాలం ఆలస్యంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఆరుద్ర కార్తిలోగానే వరి నారు పోసుకునే వారు. కార్తి



కరీంనగర్ రూరల్ మండలంలో నారుమడి పోసిన రైతు

దాటిపోవడంతో వరిసాగుపై రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో అధికంగా వ్యవసాయ బావులపైనే రైతులు ఆధారపడి పంట సాగు చేస్తున్నారు. బావుల్లో నీరు ఉన్న రైతులు నీటిని బట్టి నారును పోసుకుని దుక్కులు దున్నుతుండగా నారు వేయడానికి వెనుకంజ వేస్తున్నారు. సరైన వర్షాలు కురిస్తేనే నాటు వేయడానికి అనుకులంగా ఉంటుందని రైతులు చెప్పుతుండగా, మరి కొందరు నారు మడులు వేసి వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. కొద్దిపాటి వర్షానికి మండలంలో వేసిన పత్తి, మొక్కజొన్న సాగుకు అనుకూలంగా పరిస్థితులు ఉండటంతో పత్తి రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

కరీంనగర్ మండ లంలో 16వేల ఎకరాల్లో పంటసాగు చేస్తుండగా వరి పంట 12వేల ఎకరాలు, పత్తి 3వేల ఎకరాలు, మిగతా పంటలు మరో వెయ్యి ఎకరాల్లో సాగు అవుతున్నట్లు వ్యవసాయధికారులు అంచనా వేస్తున్నారు.జూలై నెలాఖరులోగా సరైన వర్షపాతం నమోదవుతే తప్ప వానాకాలం పంటలు ముందుకు సాగుతుందని లేని పక్షంలో కరువు తప్పదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మాంసం దుకాణాలపై అధికారుల దాడులు

-పలు దుకాణాలకు జరిమానా

కరీంనగర్ టౌన్, జూలై 7: నగరంలోని జ్యోతినగర్, విద్యానగర్, కుర్మవాడ, రేకుర్తి, సుభాష్‌నగర్ తదితర ప్రాంతాల్లోని మాంసం విక్రయాశాలలు (దుకాణాలు)పై నగరపాలక సంస్థ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. జంతు వధశాలల్లో గొర్రెలు, మేకలు, ఆరోగ్యతను గుర్తించి స్టాండింగ్ చేసి వధశాలల్లో జంతువులను సంహరించకుండా తమ ఇళ్లలో జంతువులను వధిస్తున్నారని, ట్రేడ్ లైసెన్సు కూడా తీసుకోవడం లేదని, సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారని గుర్తించారు.

పలు దుకాణాలకు 40,500 రూపాయల జరిమానాను విధించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ వెంకన్న, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ స్వామి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సభ్యులు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ గట్టు శ్రీనివాస్, జవాన్లు పాల్గొన్నారు.

భగవద్గీత సహస్రగళ పారాయణం

కరీంనగర్ కల్చరల్, జూలై 7: నగరంలోని అశోక్‌నగర్ మళయాళ సద్గురు గీతామందిరం మఠాధిపతి విష్ణుసేవానందగిరి స్వామి ఆధ్వర్యంలో గీతాభక్త సమాజం నేతృత్వంలో ఆదివారం వైశ్యభవన్‌లో కలశ, గణపతి పూజ, శ్రీకృష్ణునికి అభిషేకం, అనంతరం సంపూర్ణ భగవద్గీత సహస్రగళ పారాయణం చేయగా స్పందన లభించింది. సంపూర్ణానందగిరిస్వామి, విష్ణుసేవానందగిరిస్వామి, చిదానందగిరిస్వామి, జగదీశ్వరానందగిరిస్వామితో పాటు పురాణం మహేశ్వరశర్మ అతిథులుగా హాజరై ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ బండ సత్తయ్య, కో కన్వీనర్లు కొమురవెల్లి వేంకటేశం, రాచమల్ల ఆంజనేయులు, ఉప్పల రామేశం, గుండ రాధాకిషన్, అర్చకులు పాల్గొన్నారు.

●పారాయణంలో భాగంగా భగవద్గీతను పాఠశాల, కళాశాల స్థాయిల్లో పాఠ్యాంశంగా చేర్చాలని అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం గీతా భక్తసమాజం బాధ్యులు కరీంనగర్‌లో ఉన్న కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కలసి గీతను పాఠ్యాంశంగా చేర్చేందుకు చొరవ చూపాలని కోరగా ఆయన సుముఖత వ్యక్తం చేశారు.

మానవ హిత గ్రంథం భగవద్గీత

కరీంనగర్ కల్చరల్, జూలై 7: మానవ హిత గ్రంథం భగవద్గీత అని రచయిత, విమర్శకుడు, కాలమిస్ట్, కీర్తి పురస్కార గ్రహీత గన్నమరాజు గిరిజామనోహర్‌బాబు అన్నారు. ఆదివారం భగత్‌నగర్ వివేకానంద హైస్కూల్‌లో వైరాగ్యం ప్రభాకర్ రచించిన జీవన తత్వ గీత-నిత్య చైతన్య ప్రదాత భగవద్గీత పుస్తకావిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో వేదభవనం ప్రిన్సిపాల్ డాక్టర్ కలకుంట్ల వరప్రసాదాచార్యులు, సమైక్య సాహితి అధ్యక్షుడు మాడిశెట్టి గోపాల్, ఉట్నూరు ఎంపీడీఓ మాడుగుల మురళీధరశర్మ, దాస్యం సేనాధిపతి పాల్గొన్నారు.

'ప్రైవేట్ పాఠశాలల ఫీజులు తగ్గించాలి'

భగత్‌నగర్, జూలై 7: ప్రైవేట్ స్కూల్ ఫీజులు తగ్గించాలని టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్‌కు వేతనాలు పెంచాలని సిఐటియు, పేరెంట్స్, టీచర్స్ ఉద్యోగ, కార్మిక, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ వైద్య, ఇంజనీరింగ్, డిగ్రీ విద్యా తదితర కోర్సులకు ప్రభుత్వం నిర్దిష్టమైన ఫీజు స్ట్రక్చర్ నిర్ణయించి అమలుచేస్తుంది కాని పాఠశాల, ఇంటర్ విద్యకు నిర్దిష్టమైన ఫీజు విధానం లేదన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లాకార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గుగులోత్ తిరుపతి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, ప్రైవేట్ స్కూల్స్ ఉపాధ్యాయుల సంఘం నాయకుడు బోనగిరి సదానందం, ఆశావర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు శారద, పున్నంరవి, జివిద్యాసాగర్, సదానందాచారి, సురభి శ్రీకాంత్, తిరుమలయ్య మల్కాల్ల శ్రీనివాస్, డి.మనోహర్‌రెడ్డి, అరిఫ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేస్తున్న నాయకులు

సుభాష్‌నగర్, జూలై 7: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఆదివారం కరీంనగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ ఆధ్వర్యంలో బస్టాండ్ ఎదురుగా జెండా ఆవిష్కరణ చేసి కేక్ కట్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు బోయిని కొమురయ్య, దండు అంజయ్య, కొత్తూరి రాజన్న, కవ్వంపెల్లి రాములు, కనకం అంజిబాబు, నాగెల్లి దేవేందర్, చుంచు నర్సయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

●హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఆదివారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రవీందర్, వసంత్, రామచంద్రం, శ్రీనివాస్, సాగర్, సుమన్, వెంకట్రాజం, రత్నం, శేఖర్, మల్లయ్య, రాజకుమార్, మొగిలి, సమ్మయ్య, రామస్వామి పాల్గొన్నారు.

●శంకరపట్నం: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఇదేరోజు మందకృష్ణ మాదిగ జన్మదినం కావడంతో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు కనుకుంట్ల శ్రీనివాస్, వెంకటస్వామి, నర్సయ్య, శంకరయ్య, భద్రయ్య, రవి పాల్గొన్నారు.

●రామడుగు: మండల వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. గోపాల్‌రావుపేట, వెంకట్రావ్‌పల్లి, వెదిర, తిరుమలపూర్, శ్రీరాములపల్లి గ్రామాల్లో వేడుకలు అట్టహాసంగా జరిగాయి. కార్యక్ర మంలో చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ శంకర్, త్రినాథ్‌వర్మ, శంకర్, అరుణ్, రఘు, కరుణాకర్, రమేష్, అనుమంతు, ఇమ్మి, బీసీ సంఘం నాయకులు ఒగ్గు మల్లేష్, నాగరాజు తదితరులు ఉన్నారు.

●తిమ్మాపూర్: మండల కేంద్రంలో, అలుగునూర్‌లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అంజిబాబు, నాయకులు కొమురయ్య, నరసయ్య, రవి, లక్ష్మణ్, రమేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

●గంగాధర: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జెండాను ఆవిష్కరించారు. మందక్రిష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గంగాధర రవి, రాష్ట్ర నాయకుడు చిలుముల రాజయ్య,రాములు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా పోచమ్మ బోనాలు



తీగలగుట్టపల్లిలో బోనం ఎత్తుకున్న కేంద్రమంత్రి బండి సంజయ్, మానకొండూర్‌లో బోనాలతో మహిళలు

కరీంనగర్ కల్చరల్/భగత్‌నగర్, జూలై 7: నగరంలోని తీగలగుట్టపల్లిలో ఆదివారం పెద్దమ్మతల్లి బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ పాల్గొని బోనం ఎత్తి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక మార్కండేయనగర్ శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ కులబాంధవులు పోచమ్మ బోనాలు నిర్వహించారు. రాంనగర్, ప్రగతినగర్, సప్తగిరి కాలనీ, మార్కండేయనగర్ ప్రాంతాల్లో నివసించే విశ్వబ్రాహ్మణ కులస్తులు, మహిళలు బైపాస్ రోడ్‌లోని పోచమ్మ ఆలయానికి తరలివచ్చి బోనాలు, పసుపు, కుంకుమలు, గాజులు, వస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ముఖ్య అతిథిగా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం జిల్లా అధ్యక్షుడు పాములపర్తి వేణుగోపాలాచారి హాజరు కాగా జాతరలో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పాములపర్తి శ్రీనివాసాచారి, కళికోట శ్రీనివాస్, కోశాధికారి శివప్రసాద్, సభ్యులు శ్రీనివాస్, ఆంజనేయులు, కళాధర్, వేణుగోపాల్, ఆనందం, రామస్వామి, రాంప్రసాద్, శ్రీనివాస్, దీక్షిత్ పాల్గొన్నారు.

మానకొండూర్: మానకొండూర్‌లో ఆదివారం మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలను నిర్వహించారు. ఆషాఢ మాసం పురష్కరించుకొని మహిళలు పోచమ్మ బోనాలను ఎత్తుకొని డప్పు చప్పుళ్ళ మధ్య ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో బోనాలను పెట్టి అమ్మ వారికి నైవేద్యం సమర్పించారు.

రెడ్డి సంఘం

జిల్లా ఉపాధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి



రామడుగు, జూలై 7: రామడుగు మండలం రంగసాయిపల్లి గ్రామానికి చెందిన గాజర్ల సుధాకర్‌రెడ్డిని ఆల్ ఇండియా రెడ్డి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బీరెడ్డి కరుణాకర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డి సమస్యలపై పోరాటం చేస్తానని, తనపై నమ్మకంతో ఈ పదవి అప్పజెప్పిన రెడ్డి సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ ఆక్రమిత భూముల స్వాధీనం

కరీంనగర్ రూరల్, జూలై 7: నగర శివారు తీగలగుట్టపల్లి రాణిపూర్ రోడ్డు నుంచి నగునూర్ శివారు వరకు గ్రామ నక్ష రహదారిని ఆక్రమించిన ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు స్వాధీన పరచుకుని రహదారిని పునరుద్ధరించారు. నక్ష ప్రకారం ప్రభుత్వ రహదారులు అక్రమించుకున్నారని, అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని రైతులు పిర్యాదు చేయగా రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు.

కొందరు ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు, బెస్‌మెంట్‌లు కట్టడాలను చేపట్టగా, ప్రభుత్వ భూములను పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమిత భూములను సర్వే చేసి ఆ భూములను స్వాధీనం చేసుకున్నారు. నక్ష ప్రకారం సర్వే చేసిన అధికారులు ప్రభుత్వ భూములను స్వాధీన పరచుకోగా ఆక్రమించిన రోడ్డును పునరుద్ధరించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి రజినీకాంత్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సర్వీస్ రోడ్డును నిర్మించాలి



వినతిపత్రం అందజేస్తున్న బింగి కరుణాకర్

హుజూరాబాద్‌రూరల్, జూలై 7: వరంగల్ నుంచి జగిత్యాల వరకు నిర్మిస్తున్న నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా సర్వీస్ రోడ్డును నిర్మించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు మాజీ సర్పంచ్ బింగి కరుణాకర్ ఆదివారం కరీంనగర్‌లో వినతి పత్రం అందించారు. వరంగల్ నుంచి జగిత్యాల వరకు నిర్మిస్తున్న నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా మానకొండూరు, శంకరపట్నం, హుజూరాబాద్, ఎల్కతుర్తి మండలాలలోని ఆయా గ్రామాల మీదుగా వెళ్తుండగా ఆయా రైతుల భూములకు వెళ్లే రహదారులు పూర్తిగా దెబ్బతిని ఉన్నాయి. దీంతో వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని, దీనికోసం హైవే రోడ్డు పక్కనే సర్వీసు రోడ్డును నిర్మించాలని కోరగా హైవే అధికారులతో మాట్లాడి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. అలాగే రైతుబంధు రెండో విడుత నిధుల గురించి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరగా సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ పుప్పాల రఘు ఉన్నారు.

మాజీ ఎంపీపీ దంపతులకు వీడ్కోలు సన్మానం



మాజీ ఎంపీపీ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గంగుల

చిగురుమామిడి, జూలై 7: ఎంపీపీ పదవి కాలం పూర్తిచేసుకున్న సందర్భంగా స్థానిక తాజా మాజీ ఎంపీపీ కొత్త వినీత-శ్రీనివాస్‌రెడ్డిని మానకొండూర్‌లో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలకర్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానిం చారు. ఈ సందర్భంగా గంగుల మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉన్నారని ఎంపీపీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ కనమల్ల విజయ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్‌కుమార్, రసమయి బాలకిషన్, రవిశంకర్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, జూలై7: నగరంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు టౌన్ వన్ ఏడీ ఈ సాయినేని నరేందర్ తెలిపారు. కమాన్ ఫీడర్, లక్ష్మీనగర్, గాయత్రినగర్, షాషామహల్, మధుగార్డెన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వివాహిత ఆచూకీ లభ్యం

కరీంనగర్ క్రైం, జూలై 7: భార్యభర్తల మధ్య మనస్పర్థలతో ఈ నెల 3న ఇంటి నుంచి తన ముగ్గురు పిల్లలతో బయటకు వెళ్లి అదృశ్యమైన వివాహిత గోద భాగ్యలక్ష్మి, ఆమె ముగ్గురు పిల్లలు క్షేమంగా ఇంటికి చేరారు. భర్తపై కోపంతోనే ఆమె తన పిల్లలను తీసుకుని బంధువులకు వెళ్లి ఆదివారం తిరిగి ఇంటికి చేరిందని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

దొండకాయల మాలల అలంకరణలో దుర్గాభవాని

కరీంనగర్ రూరల్, జూలై7: కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌లోని శ్రీదుర్గభవాని ఆలయంలో ఆదివారం అమ్మవారు దొండకాయల మాలల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు పవనకృష్ణ శర్మ అమ్మవారికి విశేష హరతులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా అమ్మవారి సన్నిదిలో శ్రీవెంకట అన్నమాచార్య సేవట్రస్టు బాధ్యులు మమతా రెడ్డి, సభ్యులు కొలాట ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ వంగల లక్ష్మణ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కరీంనగర్ రూరల్, జూలై7: కరీంనగర్ రూరల్ మండలం చెర్లబూత్కూర్ కాకతీయ హైస్కూల్‌కు చెందిన 1996-97, 1997-98 సంవత్సరంలో కాకతీయ హైస్కూల్‌లో చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.ఆనాడు చదువు నేర్పిన గురువులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యా ర్థులు ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 27సంవత్సరాల తర్వాత స్కూల్‌లో చదివిన విద్యార్థులు ఒకే చోటకు చేరుకుని ఆత్మీయంగా పలకరించుకోవడం ఆనందంగా ఉందని విద్యార్థులు తెలిపారు. జీవితంలో ఎన్ని కష్టాలోచ్చిన ఆదుకునే వాడు స్నేహితుడని, జీవితాంత స్నేహం ఇలాగే కొనసాగాలని కోరు కున్నారు. అనంతరం ఆటపాటలతో పూర్వ విద్యార్థులు ఆనందో త్సాహాల మధ్య గడిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, పూర్వ విద్యార్థులు కూర శ్యాంసుందర్‌రెడ్డితో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నవరం సోదరులకు పురస్కారాలు

కరీంనగర్ కల్చరల్, జూలై 7: కరీంనగర్‌కు చెందిన సోదరులు కవి అన్నవరం దేవేందర్, చిత్రకారుడు అన్నవరం శ్రీనివాస్ ఆదివారం హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియం వేదికగా శాలివాహన విశిష్ట ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు. వరకవి సిద్దప్ప జయంతి సందర్భంగా శాలివాహన చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళా సాంస్కృతిక కళా రంగాల్లో కృషి చేసిన వారికి ఈ పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్తపతి డీఎన్‌వి ప్రసాద్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో రజత పతకం

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై7: రాష్ట్ర రెండవ కిడ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన నురైన్ రజతపతకం సాధించింది. హైదరాబాద్‌లో శనివారం జరిగిన ఈ పోటీలలో అండర్10 బాలికల విభాగంలో 100మీటర్ల పరుగుపందెంలో ఆమె ద్వితీయ స్థానం సాధించి రజతపతకం సాధించింది. పతకం సాధించిన నురైన్‌ను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కదారి రవి, కోచ్ అభినందించారు.

వివేకానంద విద్యార్థుల అనాథాశ్రమం సందర్శన

కరీంనగర్ టౌన్, జూలై 7: నగరంలోని భగత్‌నగర్ వివేకానంద విద్యానికేతన్ 9,10వ తరగతి విద్యార్థులు వెంకట్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న అనాథాశ్రమాన్ని సందర్శించారు. ఆదివారం వివేకానంద విద్యానికేతన్ విద్యాసంస్థల చైర్మన్ సొగాని కొమురయ్యతో కలిసి అనాథాశ్రమాన్ని సందర్శించి కొద్దిసేపు వారితో మాట్లాడి మనోభావాలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర హోం శాఖ సహాయమంత్రికి సన్మానం

భగత్‌నగర్, జూలై 7: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జిల్లా పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు మహాశక్తి దేవాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండోజు లక్ష్మయ్య చారి, సహాయ కార్యదర్శి ఊకంటి ఓంకారాచారి,జిల్లా సంఘం కన్వీనర్ శ్రీరామోజు రవీంద్రచారి, నగర కన్వీనర్ తీప్పారపు శ్రీనివాస్, జిల్లా కో-కన్వీనర్ కొత్తపల్లి బ్రహ్మచారి, ముశోజు ప్రభాకర్, కనపర్తి సత్యనారాయణ, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు గాలిపెల్లి రమేష్, వెంకటేశ్వర్లు, శ్రీరామోజు బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వీణంక, జూలై 7: మండలంలోని చల్లూరు గ్రామనికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు అబ్దుల్ షకీల్ అనారోగ్యంతో మృతి చెందగా బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ ఆదివారం మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబాన్ని పరామర్శించి మృతికి గల కారణలు అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వీరి వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల పరామర్శ

జమ్మికుంట రూరల్, జూలై 7: పీసీసీ మెంబర్ పత్తి కృష్ణారెడ్డిని పలువురు కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. ఆయ సోదరుడు పత్తి విష్ణువర్ధన్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృత్యువాతపడ్డాడు. ఆదివారం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య, నాయకులు రావపల్లి రమేష్, పొనగంటి రవీందర్, బుర్ర కుమార్, తిరుపతి, శ్రీనివాస్, సదానందం, తదితరులు పరామర్శించారు.

'డబుల్' ఇళ్లను పంపిణీ చేయాలి

జమ్మికుంట, జూలై 7: హుజూరాబాద్ నియోజక వర్గంలో ఈటల రాజేందర్ మంత్రిగా ఉన్న సమయంలో వందలాది డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారని, వాటిని వెంటనే పంపిణీ చేయాలని మాజీ జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్ శ్యామ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుపయోగంగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చొరవ తీసుకొని వెంటనే పంపిణీ చేయించాల్సిన అవసరం ఉందన్నారు.

విద్యార్థులకు అభినందనలు

చొప్పదండి, జూలై 7: మండలంలోని కొలిమికుంటకు చెందిన విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించగా జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్ళపల్లి శ్రీనివాస్ గౌడ్ సన్మానించారు. మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎగొల్లపు చరణగౌడ్, పంజాల హాసినీలు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కాగా ఆదివారం శ్రీనివాస్‌గౌడ్ విద్యార్థులను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాళ్ళపల్లి సుజాత, పెరుమాండ్ల వెంకటరాజం, ఎగొల్లపు రాజు, పంజాల గంగయ్యగౌడ్, మల్లేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.